సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 26 । మార్చి । 2025



కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో..

భీమవరం (ప్రకాశంచౌక్): సీఎం అధ్యక్షతన సచివాలయంలో కలెక్టర్ల సమావేశం మంగళవారం ప్రారంభమైంది. కలెక్టర్ సీహెచ్ నాగరాణి సమావేశంలో పాల్గొన్నారు.



కోకో రైతులను ఆదుకోవాలి

కోకోకు మద్దతు ధర ప్రకటించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ లింగపాలెం, తాడేపల్లిగూడెం, ద్వారకా తిరుమల మండలాల్లో రైతులు రోడ్డెక్కారు. IIలో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సాయంత్రం)	సహరి గురువారం (ఉదయం)
భీమవరం	6.21	4.42
నరసాపురం	6.22	4.40
తాడేపల్లిగూడెం	6.16	4.51

న్యూస్‌రీల్

పిల్లల సంరక్షణకు పోక్సో చట్టం దోహదం



పోక్సో చట్టంపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ధనరాజు

భీమవరం: పిల్లల సంరక్షణకు పోక్సో చట్టం ఏర్పడిందని, లైంగిక వేధింపులకు గురవుతున్న పిల్లలు ధైర్యంగా టీచర్లు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంటుందని భీమవరం 2వ అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు అన్నారు. మంగళవారం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ, ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్‌కుమార్, ఎంటీ భవాని, బి.లోకేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ

భీమవరం(ప్రకాశం చౌక్): మున్సిపాలిటీలోని భవనాలు, ఖాళీ స్థలాల ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నారని.. ఈ నెల 31 వరకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్ష

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని పరీక్షల పర్యవేక్షకుడు సుందరకుమార్ చెప్పారు. ఉదయం షిఫ్టులో నిర్వహించిన పరీక్షకు 100 మంది అభ్యర్థులకు 52 మంది హాజరుకాగా మధ్యాహ్నం షిఫ్టులో 100 మందికి 57 మంది హాజరయ్యారన్నారు. డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఉదయం షిఫ్టుకు 101 మందికి 44మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాప్) బాల్యవివాహాల నిరోధం, పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే వివరాలను దగ్గరలోని సంబంధిత అధికారులు, లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలపై దాడులు పెరిగాయని వాటిని నివారించడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

సాయం పేరిట స్వాహా

- వరద సాయం బియ్యాన్ని బొక్కేసిన జనసేన నేత
- విజయవాడ వరద బాధితుల పేరిట బియ్యం సేకరణ
- అమ్ముకుని సొమ్ము చేసుకున్న గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి
- మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పే చేశానన్న సదరు నేత


సాక్షి ప్రతినిధి, ఏలూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జనసేన శ్రేణులు గత ఏడాది ఊరూరా తిరిగి బియ్యం సేకరించారు. ఇలా దాతలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల నుంచి భారీ ఎత్తున సేకరించిన బియ్యాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒకరు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడీ విషయం బయటకు పొక్కింది. దీంతో.. ఆ మొత్తం డబ్బును పార్టీకి విరాళంగా ఇస్తానని.. ఇదంతా మంత్రి కందుల దుర్గేష్‌కు చెప్పే చేశానని ఆయన తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వివాదం ముదరడంతో రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో దీనిపై పంచాయితీ జరిగింది. **విషయం సెటిల్ కాకపోవడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం** తీసుకెళ్లారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో **ఇప్పుడీ వ్యవహారం కలకలం రేపుతోంది.**

అసలేం జరిగిందంటే..

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు నేతృత్వంలో గతేడాది నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీగా బియ్యం సేకరించారు. ఇలా సేకరించిన బియ్యాన్ని విజయవాడలో బాధితులకు పంచకుండా ఆయన విక్రయించేశారు. ఈ సొమ్మును నియోజకవర్గ ఇన్‌చార్జే స్వాహా చేశాడని ఒక వర్గం దుమ్మెత్తిపోస్తుండగా.. ఇన్‌చార్జి వర్గం మాత్రం సొమ్ము తమ వద్దే ఉందని, పార్టీకి విరాళం ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటే కుదరడం లేదని, మంత్రి కందుల దుర్గేష్‌కు విషయం చెప్పామని అంటున్నారు. **విరాళం ఇవ్వడానికి తమను పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకువె**ళ్తారంటూ చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం వచ్చినప్పుడు కూడా ఆయనకు చెక్కు ఇవ్వడం కుదరలేదా అని ప్రత్యర్థి వర్గం నిలదీస్తోంది.

రూ.16 లక్షలకు అమ్ముకున్నారు

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు, ఆయన వ్యతిరేక వర్గం మధ్య ఈ విషయంలో కొద్దిరోజులుగా తారాస్థాయిలో వివాదం నడుస్తోంది. సేకరించిన బియ్యాన్ని రూ.10.27 లక్షలకు విక్రయించానని సువర్ణరాజు చెబుతుంటే.. రూ.16 లక్షలకు అమ్ముకున్నారని వ్యతిరేక వర్గం చెబుతోంది. దీనిపై పార్టీ జిల్లా నేతల వద్ద పంచాయితీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో.. రెండ్రోజుల క్రితం జంగారెడ్డిగూడెంలో జనసేన నాయకుడు కరాటం **సాయి పార్టీ ఆదేశాలతో గోపాలపురం నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు.** సువర్ణరాజు అనుకూల, వ్యతిరేక వర్గాలు ఘర్షణకు దిగడంతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో కరాటం సాయి చేతులెత్తేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి వ్యవహారం తీసుకెళ్తున్నట్లు చెప్పి సమావేశం ముగించారు.



అధికారం కోసం అడ్డదారులు

- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలే టార్గెట్‌గా కక్ష సాధింపు
- 27న అత్తిలి, యలమంచిలి ఎంపీపీ ఎన్నిక
- రెండు చోట్లా వైఎస్సార్‌సీపీకి పూర్తి మెజార్టీ
- బలం లేకపోయినా టీడీపీ దౌర్జన్యకాండ
- అత్తిలి ఎంపీపీ అభ్యర్థి పెట్రోలు బంకుపై దాడులు
- ఎంపీటీసీలకు రూ.5 లక్షల చొప్పున బేరం
- తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చిల్లర రాజకీయాలు



అత్తిలిలో ఎంపీపీ అభ్యర్థి పెట్రోలు బంకుల్లో తనిఖీలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అధికార మదంతో తెలుగుదేశం పార్టీ చిల్లర రాజకీయాలకు తెరదీసింది. పోటీకి కనీస బలం లేకపోయినా.. వైఎస్సార్‌సీపీ స్థానిక ప్రజా ప్రతినిధులు లొంగకపోతే బెదిరింపులు, వ్యాపార సంస్థలపై దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం అత్తిలిలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నీచ రాజకీయాలకు తెరదీయడం జిల్లాలో సంచలనంగా మారింది. అత్తిలి ఎంపీపీ అభ్యర్థి పెట్రోలు బంకులపై ఒకేసారి విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేసి బెదిరింపులకు దిగారు. ఈ నెల 27న అత్తిలి, యలమంచిలి ఎంపీపీ స్థానాలకు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కైకలూరు వైస్ ఎంపీపీ, పెరవలి కోఆప్షన్ సభ్యులతో పాటు 8 ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అత్తిలి ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ గతంలో కైవసం చేసుకుంది. మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు 16 చోట్ల వైఎస్సార్‌సీపీ, రెండు జనసేన, రెండు టీడీపీ గెలుపొందాయి. ఎంపీపీ పదవి రెండున్నరేళ్ల చొప్పున ఇద్దరికి ఇవ్వాలని ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో మొదటి విడతలో మక్కా సూర్యనారాయణ ఎంపీపీగా పదవి నిర్వహించగా రెండో పర్యాయం రంభ సుజాతకు ఇవ్వాలని నిర్ణయించారు. యలమంచిలిలో 18 ఎంపీటీసీ స్థానాలకు ఒక స్థానం ఖాళీగా ఉండగా.. 17లో వైఎస్సార్‌సీపీ 13, జనసేన 1, టీడీపీ 3 స్థానాల్లో గెలిచాయి. ఇక్కడ కూడా ఇద్దరు నేతలు చెరో రెండున్నరేళ్లు పదవి పంచుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎంపీపీ రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. యలమంచిలిలో రావూరి వెంకటరమణ మొదటి విడత ఎంపీపీగా పదవీ కాలం పూర్తికాగా ఇప్పుడు వినుకొండ ధనలక్ష్మిని ఎంపిక చేశారు.

అత్తిలిలో అడ్డగోలు రాజకీయం

అత్తిలిలో కూటమి సంఖ్యా బలం నాలుగు కాగా, మాజీ ఎంపీపీ సూర్యనారాయణ టీడీపీలో చేరడంతో ఐదుకు చేరింది. వైఎస్సార్‌సీపీ 15 మంది సభ్యులకు అత్తిలి –5 ఎంపీటీసీ సభ్యురాలు తండా జ్యోతి గల్ఫ్ వెళ్లడంతో 14 మంది ఉన్నారు. ఐదుగురు సభ్యులను తమ వైపునకు తిప్పుకుంటే తమ సంఖ్యాబలం పదికి చేరి ఎంపీపీ పదవి తమకు వస్తుందన్న భావనలో టీడీపీ నేతలు ఉన్నారు. కొద్ది రోజులుగా అందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. నియోజకవర్గ నేత మధ్యవర్తుల ద్వారా వైఎస్సార్‌సీపీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల వరకు ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. వారి ప్రలోభాలకు లొంగకుండా పార్టీని వీడేదిలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు తేల్చిచెప్పడంతో కంగుతిన్న సదరు నేత కక్షసాధింపు చర్యలు మొదలుపెట్టారు.

ఎమ్మెల్యే కక్ష సాధింపు: మాజీ మంత్రి కారుమూరి

ఎలాగైనా అత్తిలి ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ ఎన్నో ప్రయత్నాలు చేశారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. పోటీకి కనీస బలం లేకపోయినా అడ్డగోలు రాజకీయాలతో నియోజకవర్గాన్ని నాశనం చేస్తూ ప్రశాంత వాతావరణాన్ని పాడుచేస్తున్నారని మండిపడ్డారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ఎంపీపీగా రంభ సుజాత ఎన్నిక లాంఛనమే. పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం ఎంపీటీసీ సభ్యులు బయలుదేరారు. ఇంతలో రంభ సుజాతకు చెందిన అత్తిలి– పిప్పర రోడ్డులోని శ్రీసూర్య ఫిల్లింగ్ స్టేషన్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం గమనార్హం. ఈ విషయం తెలిసి సుజాత భర్త సూరిబాబు మధ్యలోనే వెనుదిరిగారు. ఉదయం మొదలైన సోదాలు సాయంత్రం వరకు కొనసాగడం గమనార్హం. విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని.. విజిలెన్స్ సీఐ ప్రసాద్‌కుమార్ తెలిపారు.

జగన్‌ను కలిసిన అత్తిలి ఎంపీటీసీలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అత్తిలి ఎంపీటీసీలు మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌తో కలిసి ఎంపీటీసీలు జగన్‌ను కలిసి నియోజకవర్గంలోని పరిస్థితులు వివరించారు.



తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, అత్తిలి ఎంపీటీసీలు

బాకీ అడిగితే.. కాలువలో పడేశాడు



పాలకొల్లులో కాలువలో పడిన బైక్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: బైక్‌పై తీసుకున్న ఫైనాన్స్ బాకీ అడిగిన పాపానికి.. బాకీ ఇస్తానని చెప్పి బైక్‌పై తీసుకెళ్లి కాలువలోకి తోసేశాడు ఓ ఘనుడు. పాలకొల్లు పట్టణంలో సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడు జయబాబు కథనం ప్రకారం .. కె.ముల్లా అనే వ్యక్తికి బైక్‌పై ఫైనాన్స్ ఇవ్వగా.. గత రెండు నెలలుగా వాయిదాలు చెల్లించడం లేదు. ఇటీవల ముల్లాను బాకీ కట్టాలని అడగ్గా.. ఈ నెల 18న చెల్లిస్తానని చెప్పాడు. గడువు దాటిపోవడంతో మంగళవారం పాలకొల్లు ఏరియా ఆసుపత్రి వద్ద ఉన్న ముల్లాను బాకీ చెల్లించాలంటూ జయబాబు గట్టిగా నిలదీశాడు. బైక్‌లో గుడివాడలో ఉందని.. పాడవడంతో అక్కడే వదిలేశానని చెప్పాడు. గుడివాడ వెళ్లి వాహనం తెద్దామని చెప్పగా.. అందుకు ముల్లా అంగీకరించలేదు. ఇంతలో ఆస్పత్రి పరిసరాల్లో తనిఖీ చేయగా.. నెంబర్ ప్లేట్ లేని వాహనం కనిపించింది. ఫైనాన్స్ చేసిన బైక్ అదేనని జయబాబు నిర్ధారణ చేసుకున్నాడు. ఇంతలో ఆ బైక్‌ను ముల్లా తీసుకెళ్తుండగా.. ఎక్కడకు వెళ్తున్నావని జయబాబు ప్రశ్నించాడు. డబ్బులు తెచ్చేందుకు వెళ్తున్నానని చెప్పగా.. అయితే తాను కూడా వస్తానంటూ జయబాబు ముల్లా బైక్ ఎక్కాడు. పూలపల్లి బైపాస్ రోడ్డు మీదుగా టిడ్కో గృహాల వద్దకు వెళ్లే సర్వీసు రోడ్డులోకి బైక్ తిప్పి వాహనాన్ని కాలువలోకి దూకించేశాడు. ముల్లాకు ఈత రావడంతో తప్పించుకుని వెళ్లిపోయాడు. అతి కష్టం మీద తాను గట్టుకు చేరుకున్నానని.. లేదంటే కాలువ ఉధృతిలో కొట్టుకుపోయేవాడినని జయబాబు పేర్కొన్నాడు. గట్టుపైకి వచ్చాక మనుషులను పెట్టించి కాలువలో ఉన్న వాహనాన్ని బయటకు తీయించాడు.

సమావేశాలు వాయిదా

ఏలూరు(మెట్రో): ఈ నెల 27న జరగాల్సిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ సంఘ సమావేశాలు, సర్వసభ్య సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయని ఏప్రిల్ 4న జరుగుతాయని జెడ్పీ సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

ఏప్రిల్ ఒకటి నుంచి సదరం క్యాంపులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఏప్రిల్ 1 నుంచి సదరం క్యాంపులు, స్లాట్లు తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త(డీసీహెచ్ఎస్) డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు. పెన్షన్ల వెరిఫికేషన్ కోసం ప్రభుత్వం సదరం క్యాంపులను నిలిపివేసింది. వెరిఫికేషన్‌తో పాటు సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి మంగళవారం ఏరియా, జిల్లా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయా విభాగాల వైద్యులు సదరం క్యాంపుల్లో పేషెంట్లను పరీక్షిస్తారన్నారు. వార్డు, గ్రామ సచివాలయం ద్వారా సదరం స్లాట్ బుక్ చేసుకొవచ్చని తెలిపారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ పేరిట ఆగడాలు

ఏలూరు టౌన్: బజాజ్ ఫిన్‌సెర్వ్‌లో రుణాలు తీసుకుని.. ఆర్థిక ఇబ్బందులతో రుణాలు బకాయిపడిన వ్యక్తులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్న ప్రైవేటు ఏజెన్సీ ముఠాను ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ డీ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. శాంతినగర్ 4వ రోడ్డులోని ఎస్పీసీ ఎలిమెంట్ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని సడక్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ పేరిట కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. బజాజ్ ఫిన్‌సర్వ్‌లో ఈఎంఐ బకాయిలు ఉన్న కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేయటమే ఈ ఏజెన్సీ లక్ష్యం. ఈ ముఠా సభ్యులు తాము పోలీస్ అధికారులమని.. లాయర్లమంటూ ఫోన్ చేసి బెదిరింపులకు దిగేవారు. ఆయా ప్రాంతాల్లోని సచివాలయ మహిళా పోలీసులు, వలంటీర్లకు ఫోన్ చేసి వారి ద్వారా బాధిత కస్టమర్లతో మాట్లాడిస్తూ బెదిరిస్తున్నారు. సచివాలయ మహిళా పోలీసుల నుంచి బాధితుల వ్యక్తిగత సమాచారాన్ని సైతం సేకరిస్తున్నారు. మీ ఫొటోలు మార్ఫింగ్ చేసి.. డేటాను సోషల్‌మీడియాలో పెడతామంటూ బెదిరిస్తున్నారు. ముఠా సభ్యులకు నకిలీ సిమ్‌లు ఇస్తూ అక్రమ కార్యకలాపాలకు ప్రోత్సాహిస్తున్న అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లి మండలం, రాంపాడు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, తిరుపతి ఆటోనగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మహమ్మద్ రియాజ్, కర్ణాటకకు చెందిన దొడ్డమని జాఫర్ సాహెబ్, వట్లూరుకు చెందిన కొమ్మిన ప్రవీణ్‌కుమార్, పెదపాడుకు చెందిన గెడ్డం కిషోర్, పోణంగి రోడ్డుకు చెందిన మధ్యాణ్ణం వంశీకృష్ణ అలియాస్ వెంకట్, ఏలూరు రామకృష్ణాపురానికి చెందిన ఎనుముల భానుధనుష్, తాడేపల్లిగూడెంకు చెందిన మురడోల అభినవ్ బాబును త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై ఏలూరు త్రీటౌన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే మూడు ల్యాప్‌టాప్స్, 3 కంప్యూటర్స్, 8 మొబైల్ ఫోన్లు, ఫేక్ సిమ్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పేదల ఆరోగ్యంతో చెలగాటం

- కూటమి పాలనలో పడకేసిన ప్రజా వైద్యం
- అటకెక్కిన ఆరోగ్య సురక్ష, ఆసరా, ఫ్యామిలీ ఫిజీషియన్
- ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఉచితంగా 14 రకాల వైద్య పరీక్షలు.. 172 రకాల మందుల పంపిణీ



భీమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవల కోసం వచ్చిన జనం (ఫైల్)

సాక్షి, భీమవరం: ఎన్నికల సమయంలో ప్రజారోగ్యంపై హామీలు గుప్పించిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ఇప్పుడు పేద, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ ఊరికే వచ్చి సేవలు అందించడం, ఆరోగ్యశ్రీ కార్డుపై రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం భరోసా.. కోలుకునే వరకు ఆరోగ్య ఆసరా వస్తుందన్న నమ్మకం.. ఇలా ప్రజారోగ్యానికి కొండత భరోసానిచ్చారు. గత ప్రభుత్వం తెచ్చిన ఆయా సేవలు కూటమి పభుత్వం వచ్చాక కనుమరుగైపోయాయి. వైద్య కోసం పేదలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడింది. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించారు. జిల్లాలోని విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 739 వైద్య శిబిరాలు నిర్వహించారు. రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది శిబిరాల్లో పాల్గొని 4.62 లక్షల మందికి వైద్యసేవలు అందించి మందులు అందజేశారు. 2,028 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఎన్నికల ముగిసిన తర్వాత కూడా షెడ్యూల్ మేరకు పలుచోట్ల వైద్య శిబిరాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య శిబిరాలను ఆపేయడంతో స్పెషలిస్ట్ వైద్యసేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.


వైద్య శిబిరాల ఊసే లేదు



గతంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి రోగులకు మందులిచ్చేవారు. ఇప్పుడు వాటి ఊసే లేదు. మెగా హెల్త్ క్యాంపులు, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు ఇలాంటి సేవలన్నీ పేద ప్రజలకు దూరమయ్యాయి.

– గొంతే హరీష్, పాందువ్వ, ఉండి మండలం

శిబిరాలు కొనసాగించాలి



గత ప్రభుత్వంలో నిర్వహించిన వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేవి. వృద్ధులు, మంచాన పట్టిన వారికి ఇంటికి వచ్చి మందులు ఇచ్చేవారు. కొద్ది నెలలుగా శిబిరాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వాటిని కొనసాగించాలి.

– పెందుర్తి సుబ్బారావు, వేదంగి, పోడూరు మండలం

ఆసరాకు ఎసరు..

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చికిత్స చేయించుకున్న రోగి కోలుకునే వరకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరాగా ఇచ్చే జీవన భృతికి కూటమి ఎసరు పెట్టింది. రోజుకు రూ.275 చొప్పున సాయం లెక్క కట్టి అందించేవారు. మామూలు డెలివరీ, శస్త్రచికిత్సకు రూ. 5,000, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విరిగిన ఎముకలకు సర్జరీ కేసులకు రూ.10,000, కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సంబంధించి సెల్యులైటీస్, కొన్ని కణుతుల చికిత్సలకు రూ.1575, చెవి, గొంతు, ముక్కు సర్జరీలకు రూ.1275, గుండె శస్త్రచికిత్సలకు రూ. ఐదు వేల నుంచి రూ. 10000 వరకు.. ఇలా ఆయా వ్యాధు లను బట్టి సాయాన్ని వారు బ్యాంకు ఖాతాలకు జమచేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరా బిల్లుల చెల్లింపు నిలిపేసింది.

ఫ్యామిలీ డాక్టర్ కనుమరుగు

వైద్య చరిత్రలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ గత ప్రభుత్వం తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను కూటమి మరుగునపెట్టేసింది. ప్రభుత్వ వైద్యులే ఇంటికి వచ్చి వైద్యం అందించేలా గత ప్రభుత్వం కార్యాచరణ చేసింది. పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రతి నెల విలేజ్ హెల్త్ క్లినిక్‌ల వద్ద వైద్య శిబిరాలు నిర్వహించి, మధ్యాహ్నం నుంచి మంచం పట్టిన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించేవారు. దీర్ఘకాలిక రోగులకు అవసరమైన మందులు అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక పేదలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

కంటి వెలుగుకు చీకటి

జిల్లాలోని ఆచంట, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం సీహెచ్‌సీల్లో ముఖ్యమంత్రి ఈ–ఐ కేంద్రాల్లోని అధునాతన పరికరాల ద్వారా గత ప్రభుత్వం ఉచితంగా కంటి వైద్యసేవలు అందించేది. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు చేయించేవారు. ఒక్కో కేంద్రంలో రోజుకు వందమందికి పైగా రోగులు కంటి వైద్యసేవలు పొందేవారు. ఈ కేంద్రాలను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థతో ఒప్పంద గడువు గత ఏడాది సెప్టెంబరుతో ముగియగా, కూటమి ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడంతో ఈ–ఐ కేంద్రాల సేవలు నిలిచిపోయింది.

క్లుప్తంగా

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు శ్రావణీనాగదుర్గ



శ్రావణీనాగదుర్గను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జాతీయస్థాయి సీనియర్ ఫాస్ట్ నెట్‌బాల్ మహిళల పోటీలకు భీమవరం సీఎస్ఎన్ కళాశాల విద్యార్థిని జి శ్రావణీనాగ దుర్గ ఎంపికైనట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఛండీఘర్ పంజాబ్ యూనివర్సిటీలో జరిగే 3వ జాతీయస్థాయి సీనియర్ ఫాస్ట్–5 నెట్‌బాల్ మహిళా పోటీల్లో తమ విద్యార్థిని నాగదుర్గ పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని మంగళవారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ అభినందించారు.

నాలుగు కేజీల వెండి ఆభరణాల చోరీ

భీమడోలు: దొంగలు తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి నాలుగు కేజీల వెండిని అపహరించిన ఘటన కురెళ్లగూడెంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14న అనంతపురంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంటిని శుభ్రం చేయించేందుకు మంగళవారం మనిషిని పంపగా అప్పటికే తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి సత్యశ్రీనివాస్‌కు ఫోన్‌లో సమాచారం అందించడంతో ఆయన భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వై.సుధాకర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. రూ.4 లక్షలు విలువ చేసే వెండి బిందెలు, పళ్లాలు అపహరణకు గురైనట్లు సత్యశ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

4న మినీ స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీలు



బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఏప్రిల్ 4వ తేదీన భీమవరంలోని టౌన్‌హాల్‌లో మినీ స్టేట్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజర్ వలవల ఫణి తెలిపారు. 55, 60, 65, 70, 75, 80, 85 కేజీల కేటగిరీలో బాడీబిల్డింగ్ పోటీలు జరుగుతాయని, చాంపియన్ ఆఫ్ చాంపియన్ విజేతకు రూ. 25 వేలు నగదు బహుమతి, అన్ని కేటగిరిల్లోని మొదటి మూడుస్థానాల్లోని విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆవిష్కరించారు. బాడీ బిల్డింగ్ వైస్ ప్రెసిడెంట్ పత్తి సురేష్, జిల్లా ప్రెసిడెంట్ కఠారి రవిశంకర్, సెక్రటరీ షేక్ ఖాసీం, సభ్యులు పాల్గొన్నారు.

హోరెత్తిన కోకో రైతుల నిరసన

- తహసీల్దార్ కార్యాలయాల వద్ద కోకో రైతుల ధర్నా
- ప్రభుత్వమే కోకో గింజలు కొనుగోలు చేయాలని డిమాండ్



తాడేపల్లిగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద కోకో రైతుల ధర్నా



లింగపాలెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కోకో రైతులు



ద్వారకాతిరుమల: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లింగపాలెం: కోకో గింజలు కొనుగోలు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ కోకో రైతులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ మాట్లాడుతూ కంపెనీలు కోకో గింజలను అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాల పేరిట కోకో గింజలను కొనుగోలు చేయకుండా కంపెనీలు రైతులను ఇబ్బంది పెట్టడం అన్యాయమన్నారు. అలాగే ఇప్పటివరకు లేని గ్రేడింగ్ విధానాన్ని కంపెనీలు తీసుకు రావడం దుర్మార్గమన్నారు. రోజురోజుకీ కంపెనీలు కోకో గింజలకు ధర తగ్గించి వేయడంతో కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలకు గురై అప్పుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి అన్ సీజన్, సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేసంగి సత్యనారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం, భాస్కర రావు, సాయిల రాంబాబు, కోకో రైతులు పాల్గొన్నారు.

కోకో పంటకు మద్దతు ధర ప్రకటించాలి

తాడేపల్లిగూడెం: కోకో పంటకు మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వమే కోకో గింజలను కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ళ వెంకట సుబ్బారావు, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కోకో రైతులు ధర్నా నిర్వహించి అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అలాగే ఆర్డీఓ కార్యాలయంలో కూడా వినతిపత్రం ఇచ్చారు. గత సీజన్లో అంతర్జాతీయ మార్కెట్ రేటు ప్రకారం కిలో రూ.1000 నుంచి రూ.1100 వరకు కంపెనీలు కొనుగోలు చేశాయని, ఈ సీజన్లో సగం పైగా ధర పడగొట్టి కంపెనీలు ఇబ్బంది పెడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోకో పంటకు మద్దతు ధర ఇవ్వాలని, కోకో గింజలు శుద్ధి, తయారీ సంస్థను స్థాపించాలని కోరారు. జిల్లా నాయకులు చర్ల పుల్లారెడ్డి, ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎలమాటి విశ్వేశ్వరరావు, పోలిన సత్యనారాయణ, ఆకులపాటి అప్పారావు, నీరుకొండ సుబ్బారావు, గొల్లపూడి సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో నిరసన

ద్వారకాతిరుమల: కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలను అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించి వెంటనే కొనుగోలు చేయాలంటూ ఏపీ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కోకో రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ దుర్గా మహాలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు బొబ్బా రమేష్, నిడదవోలు సుబ్బారాయుడు మాట్లాడుతూ కోకో గింజలతో పచ్చళ్లు పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు రైతులను ఎగతాళి చేస్తూ, అవమానించడం దారుణమన్నారు. గత నెల రోజులుగా కోకో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా కంపెనీల్లో ఏమాత్రం చలనం కలగడంలేదన్నారు. రైతుల వద్ద ఉన్న అన్ సీజన్ కోకో గింజలను వెంటనే కొనుగోలు చేసి, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరసా ధర్మరాజు, ఆర్.సుభాష్ రాజు, మహేశ్వరరావు, ఎం.వీ రాజు, కోకో రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



చెన్నారావు (32)

టి.నరసాపురం: అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టి.నరసాపురం మండలం ముత్యాలమ్మపేటలో చోటుచేసుకుంది. ఎస్సై ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుర్రం చెన్నారావు(32) కౌలుకు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో మానసిక ఒత్తిడికి లోనై మంగళవారం ఉదయం పొలంలో పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న చెన్నారావును కుటుంబ సభ్యులు వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చెన్నారావుకు భార్య ప్రభావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం అతని పదో పెళ్లిరోజు కావడం, అదేరోజు అతను మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చెన్నారావు భార్య ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలు కలగలేదనే ఆవేదనతో..

జంగారెడ్డిగూడెం: పిల్లులు కలగడం లేదనే ఆవేదనతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలివి. జంగారెడ్డిగూడెంకు చెందిన వసంతాటి వెంకటేష్ చెప్పుల షాపులో పనిచేస్తున్నాడు. ఇతనికి సుప్రియతో వివాహమై మూడేళ్లయినా పిల్లలు కలగకపోవడంతో మానసికంగా వేదన పడుతున్నాడు. ఈ నెల 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన సుప్రియ భర్త ఆత్మహత్య చేసుకోవడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అటవీ సంపద అక్రమ రవాణా



ములగలంపల్లి బీట్ అటవీ ప్రాంతంలో కలపను ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న దృశ్యం



ట్రాక్టర్‌పై అటవీ కలపను తరలిస్తున్న దృశ్యం

- ఉద్యోగుల అండదండలతో అటవీ పుల్ల రవాణా!
- యథేచ్ఛగా నాటు పొగాకు బేరన్‌లకు కలప తరలింపు

బుట్టాయగూడెం: పశ్చిమ మన్యంలోని అటవీప్రాంతంలోని అటవీ సంపద అక్రమంగా తరలిపోతోంది. ప్రస్తుతం వర్జీనియా పొగాకు బేరన్ సీజన్ కావడంతో పొగాకు బేరన్‌లకు అడవి నుంచి కలపను కొట్టి యథేచ్ఛగా కలపను తరలిస్తున్నారు. ప్రధానంగా గుళ్లపూడి, అంతర్వేదిగూడెం, ములగలంపల్లి బీట్‌ల సెక్షన్‌ల పరిధిలో కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో కలప తరలిస్తున్నా సంబంధిత ఉద్యోగులు మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గుళ్ళపూడి అటవీప్రాంతం బీట్ నుంచి కొల్లాయిగూడెం మీదుగా అక్రమంగా ట్రాక్టర్‌లలో కలప తరలిస్తుంటే కొందరు ఫారెస్ట్ అధికారులు ఆ ట్రాక్టర్‌లను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మడకం యాకోబు అనే గిరిజనుడిని అధికారులు బూటు కాలితో తన్ని గాయపరచిన సంగతి తెలిసిందే. అయితే అక్రమ కలప తరలించడానికి సుమారు రూ.2 లక్షలకు పైగా ముడుపులు తీసుకున్నారని, ఆ వ్యవహారం బయటకు వస్తుందనే గిరిజనులపై అతి దారుణంగా దాడి చేశారని గిరిజన సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అడవి నుంచి తరలిపోతున్న కలపకు అడ్డుకట్ట వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పార్టీ సభ్యత్వం తీసుకున్న ఉద్యోగిపై ఫిర్యాదు



జనసేన సభ్యత్వ కార్డు



జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న నీలం నాగేశ్వరరావు

నూజివీడు: ఒక ప్రభుత్వ ఉద్యోగి ఏదైనా రాజకీయ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలంటేనే ఆ ఉద్యోగానికి రాజీనామా చేయాలి. అలాంటిది ఏలూరు జిల్లా నూజివీడు పీఏసీఎస్ (సొసైటీ) ఇన్‌చార్జి సీఈఓ నీలం నాగేశ్వరరావు జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అతను జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడిగా సభ్యత్వం తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి రాజకీయ పార్టీల్లో సభ్యత్వాన్ని కలిగి ఉండకూడదు. జనసేన సభ్యత్వం తీసుకున్న నీలం నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన అదే పార్టీ నాయకుడు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముత్యాల కామేష్ డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు, జిల్లా సహకార శాఖాధికారికి ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలను సైతం పంపారు. రాజకీయ పార్టీ సభ్యత్వం తీసుకున్న నీలం నాగేశ్వరరావును వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పశువుల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

భీమడోలు: పశువులను దొంగిలించి వ్యాన్‌లో తరలిస్తున్న ఇద్దరు నిందితులను భీమడోలు పోలీసులు మంగళవారం పోలసానిపల్లి హైవే బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేశారు. ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాలివి. కురెళ్లగూడేనికి చెందిన పెండ్యాల కిషోర్‌కు జాతీయ రహదారి పక్కన గల వేంబ్రిడ్జి సమీపంలో ఓ పశువుల షెడ్ ఉంది. అతని తల్లిదండ్రులు పశువులను మేపుకుని జీవిస్తున్నారు. ఈనెల 22వ తేదీ అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షెడ్‌కు వేసిన తాళం పగులకొట్టి అందులోని రూ.2.5 లక్షల విలువ గల రెండు గేదెలు, రెండు దూడలను అపహరించారు. దీనిపై బాధితుడు కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ యూజే విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్‌తో పోలీసుల బృందం దర్యాప్తు చేసి చాకచక్యంగా ఇద్దరు నిందితులను పోలసానిపల్లి వంతెన వద్ద పట్టుకుని గేదెలు, దూడలతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కల్లగుంటకు చెందిన సూదెనబోయిన నరసయ్య, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్‌గా గుర్తించారు. వీరిలో నరసయ్యపై వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు ఉండగా మరో నిందితుడు దుర్గాప్రసాద్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో 12 కేసులో ఉన్నట్లు చెప్పారు. నిందితులను భీమడోలు కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. పోలీస్ బృందం పి.రామచంద్రన్, బాజి, ఎస్.శ్రీనివాసరావులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలకు చేరువ చేయాలి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఏజెంట్లు కృషిచేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో కమర్షియల్ మేనేజర్ జీఎల్‌పీవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం తణుకు ఆర్టీసీ కార్యాలయంలో డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ అధ్యక్షతన కార్గో పార్సిల్స్, కొరియర్స్ బుకింగ్ ఏజెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్గోని అభివృద్ధిపథంలో నడిపేందుకు ఏజెంట్లు పాటుపడాలన్నారు. ఆర్టీసీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కార్గో సేవలకు కూడా అనుసంధానం చేయాలని అన్నారు. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు కంటైనర్ సదుపాయం ఉందని పెద్ద సామాగ్రి, ఇంటి సామాగ్రి, వ్యాపార, వ్యవసాయ అవసరాలకు ఈ కంటైనర్ సేవలు ఉపయోగించుకోవాలన్నారు. కేవలం రూ.2 వేలు డిపాజిట్‌తో కార్గో, టికెట్ బుకింగ్ ఏజెంట్లుగా పనిచేయుటకు అవకాశం ఇస్తున్నామని, తణుకు పట్టణ, పరిసర ప్రాంత గ్రామాల్లో ఆసక్తి కలిగిన వారు తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్‌ను 98491 69396 నంబరులో సంప్రదించాలని సుబ్బారావు కోరారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఎం జిల్లా కార్యదర్శి బహిరంగ లేఖ

ఏలూరు (టూటౌన్): పోలరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. వాటి వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడుసార్లు పోలవరం పనులు పరిశీలించేందుకు వచ్చినా నిర్వాసితుల సమస్యలపై, కాలనీలో సౌకర్యాలు లేక వారు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి తెలుసుకొనే ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 159 గ్రామాలకుగాను కేవలం 39 గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చారని, మండలాలను యూనిట్‌గా తీసుకొని పరిహారం ఇవ్వడం ద్వారానే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. అలాగే పదేళ్ల క్రితం హామీ ఇచ్చిన ప్యాకేజీని ఇప్పుడు ఇవ్వడం సమంజసం కాదని, ప్రస్తుత ధరకు తగ్గట్లుగా పెంచి ఇవ్వాలన్నారు. ఇప్పుడేమో 41.15 కాంటూర్ కంటే ఎత్తు పెంచబోమని పార్లమెంట్ సాక్షిగా తీర్మానం చేస్తే, మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలపడం శోచనీయమని అన్నారు. అలాగే పరిహారానికి జిల్లాకు ఒక రీతిలో కటాఫ్ తేదీ నిర్ణయించడం అన్యాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కట్ ఆఫ్ తేదీ 2022 అక్టోబర్ 7గా నిర్ణయించి ఏలూరు జిల్లాకు 2017గా నిర్ణయించడం అన్యాయం అన్నారు. మీ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, కాంటూర్ సంబంధం లేకుండా పరిహారం ఇస్తామని చెప్పి, మొదట తరలించే గ్రామాలకే పరిహారం చెల్లించడం దుర్మార్గంగా పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవాలని, వారికి న్యాయం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున రవి కోరారు.

తప్పిపోయిన చిన్నారి.. డ్రోన్ సహాయంతో గుర్తింపు

పోలీసులకు పలువురి ప్రశంస

భీమవరం: నాయనమ్మతో భీమవరం పోస్టాఫీసుకు వచ్చి తప్పిపోయిన బాలికను పోలీసులు డ్రోన్ సహాయంతో గుర్తించి అప్పగించారు. భీమవరం మండలం చినగొల్లపాలెం గ్రామానికి చెందిన బొర్రా వెంకటనారాయణమ్మ మంగళవారం తన మనవడు, మనవరాలు దివ్య (7)ను తీసుకుని హెడ్‌పోస్టాఫీసుకు వచ్చారు. వెంకటనారాయణమ్మ పిల్లలను పోస్టాఫీసు వద్ద ఉంచి మంచినీటి బాటిల్ కోసం బయటకు వెళ్లివచ్చేసరికి మనవరాలు దివ్య కన్పించలేదు. వెంటనే వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎం నాగరాజు, ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తక్షణం స్పందించి డ్రోన్ ద్వారా విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా మావుళ్లమ్మ ఆలయం సమీపంలో చిన్నారి దివ్య ఉండడాన్ని గుర్తించి నారాయణమ్మకు అప్పగించారు. నారాయణమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

చోరీ కేసులో ముద్దాయికి జైలుశిక్ష

యలమంచిలి: దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ ఆర్ వరలక్ష్మి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు కోర్టు ఏఎస్సై కేఎస్ భాస్కరరావు తెలిపారు. యలమంచిలి మండలం పెనుమర్రుకు చెందిన ఉండ్రాజవరం పెద్దింట్లు ఇంట్లో గతేడాది జూన్ 5న దొంగతనం జరిగింది. రాజోలు మండలం కాత్రేనిపాడు గ్రామానికి చెందిన ముద్దాయి రేకపల్లి నాగరాజు అందరూ నిద్రపోయిన సమయంలో పెద్దింట్లు ఇంట్లో ప్రవేశించి రూ.70 వేలు నగదు, నాలుగు బంగారం ఉంగరాలు, ఒక బ్రాస్లెట్ దొంగిలించాడు. దీనిపై బాధితురాలు పెద్దింట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కాకి శివన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఎస్సై కర్ణీడి గుర్రయ్య ముద్దాయిని అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీన పరుచుకుని కోర్టుకు హాజరుపరిచారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నాగరాజుకి ఏడు నెలలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంఏ హమీద్ వాదించగా, సాక్షులను కోర్టుకు హాజరుపరచుటలో కోర్టు కానిస్టేబుల్ ఎస్ అశోక్ సహకరించారని భాస్కరరావు వివరించారు.

జాతీయ పురస్కారానికి నవీన్ లొట్ల ఎంపిక



నవీన్ లొట్ల

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన యువ దర్శకుడు నవీన్ లొట్ల జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన లఘుచిత్రాల పోటీల్లో నవీన్ నిర్మాతగా వ్యవహరిస్తూ స్వీయ రచన, దర్శకత్వంలో నిర్మించిన 'బి ఏ హ్యూమన్' లఘుచిత్రం 'సర్టిఫికెట్ ఆఫ్ స్పెషల్ మెన్షన్'గా ఎంపికైంది. గృహ హింస, మహిళలపై దాడుల ఇతి వృత్తంగా నిర్మించిన లఘుచిత్రాన్ని జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ సి.రామసుబ్రహ్మనియన్ నేతృత్వంలో కమిషన్ జ్యూరీ పరిశీలించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు నవీన్ తెలిపారు. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో నవీన్ ఈ అవార్డు అందుకోనున్నారు.

క్లుప్తంగా

న్యాయవాదులకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామేష్

తణుకు అర్బన్: ముస్లిం సోదరుల దైవ స్వరూపం పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో కఠినంగా ఉపవాసాలు ఆచరిస్తారని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ అన్నారు. మంగళవారం తణుకు శిరాతుల్ ముస్తాఖీం మసీదులో మైనుద్దీన్ అబ్దుల్ రెహ్మాన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామేష్ మాట్లాడుతూ తోటి వారికి సాయపడమనే మంచి వ్యాఖ్యాలు ఖురాన్ చెబుతుందని అన్నారు. సర్వమత సారం శాంతి సంకేతాలను సమాజానికి ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వి. గోవిందరావు, ఈద రామకృష్ణ, జి.అంబేట్, కౌరు వెంకటేశ్వరులు, ఎం సుబ్బయ్య, ఎ.రమేష్, సీహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పడగాల మృతిపై నిజం నిగ్గుతేల్చాలి

తణుకు అర్బన్: రాజమండ్రిలో రోడ్డు ప్రమాదంలో ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి తణుకు మండల ఫెలోషిప్ సంతాపం తెలపారు. తణుకులో ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫెలోషిప్ కార్యదర్శి బ్లెస్సింగ్ రాజ్ మాట్లాడుతూ ప్రవీణ్ మరణం క్రైస్తవ లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రమాద ఘటన కూడా అనుమానాస్పదంగా ఉందన్నారు. పోలీసు అధికారులు ఘటన జరిగిన తీరుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నిజాన్ని వెలికితీయాలని కోరారు. క్రైస్తవ సమాజానికి ప్రవీణ్ మరణం తీరనిలోటని, సమాజంతో పాటు సోషల్ మీడియాలో, క్రీస్తు సంఘాల్లో క్రైస్తవ వాయిస్ మూగబోయిందని అన్నారు. ఫెలోషిప్ అధ్యక్షుడు మనోజ్‌బాబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐజక్ బ్రైన్హమ్, బ్లెస్సింగ్ రాజ్ డేవిడ్‌బాబు, జోయన్న, ఏసురత్నం, జాషువా పాల్గొన్నారు.

సినీ దర్శకుడు కృష్ణవంశీ పర్యటన


దర్శకుడు కృష్ణవంశీతో యెగ్గిన నాగబాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ సినీ దర్శకుడు కృష్ణవంశీ తాడేపల్లిగూడెం పర్యటించారు. స్థానిక కొబ్బరితోటలోని బాల్యమిత్రుడు నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబును కలిశారు. శ్రీదేవి మహంకాళి అమ్మవారికి కృష్ణవంశీ పూజలు జరిపారు. కృష్ణవంశీని ఉచిత రీతిన సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తాను పుట్టిన తాడేపల్లిగూడెంను, ఆడుకున్న బాల్యాన్ని, కొబ్బరితోటను మర్చిపోలేనని వివరించారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి


అలంపురంలో వైద్యపరీక్షలలో వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పూజిత

పెంటపాడు: వేసవికాలంలో ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని ముదునూరు ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ పూజిత పేర్కొన్నారు. మంగళవారం ఆమె ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యపరీక్షలలో భాగంగా జెడ్పీ స్కూలు వద్ద ఉన్న సబ్‌సెంటర్‌లో వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 50 మంది వృద్ధులకు, 10 మంది గర్భిణీలకు, మరో 80 మందికి సాధారణ వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్, స్కూలు ప్రాంతాలలో వైద్యపరీక్షలు చేసి సబ్‌సెంటర్‌లో రోగులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ద్రావణం, తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సీహెచ్‌వో కీర్తి, ఏఎన్ఎం కాంతామణి, ఆశాలు పాల్గొన్నారు.

కంటిచూపుపై శ్రద్ధ చూపాలి

ఇరగవరం: విద్యార్థులు కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు వక్తలు తెలిపారు. మండల పరిషత్ పాఠశాలలో కడలి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కంటి చూపు మెరుగు అవ్వడానికి ఆకు కూరలు, ఎ.విటమిన్ పోషక ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. తక్కువ చూపు ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వేండ్ర నాగరాజేశ్వరరావు, వేండ్ర జనార్దన్, ఏలూరి వీర వెంకటేశ్వరరావు, చవ్వాకుల సత్యనారాయణ, కడలి పైళ్లరావు, జి.మహాలక్ష్మి, యా.వరలక్ష్మి, పి.రేణుక, గాలేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల భవితకు భరోసా

- 'పోషణ్‌భీ-పఢాయిభీ' పథకంతో చిన్నారుల ప్రగతి
- పథకం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
- ప్రీ స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి
- పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


ఇరగవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఇరగవరం: బాలల భవితకు కేంద్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. భావి భారత విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్‌బీ-పదాయిబీ పథకం అమలు చేస్తుంది. ముఖ్యంగా చిన్నారులు తొలి అడుగులు వేసే అంగన్‌వాడీ కేంద్రాలపై దృష్టి సారించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ సూల్స్‌గా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. చిన్నారులకు విద్యతో పాటుగా ఆరోగ్య సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ్‌బీ-పడాయిబీ పథకంపై అవగాహన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బాల్య సంరక్షణ విద్య (ఎర్లీ చైల్డ్‌వుడ్ కేర్ ఎడ్యుకేషన్ ఈసీసీఈ)పై మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ బాధ్యతలను నేషనల్ ఇనిస్టి


రేలంగి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న దృశ్యం

ట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో-ఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపీసీసీడీ)కి అప్పగించారు.

ఐటీడీఏ పరిధిలో 319 సెంటర్లలో అమలు

ఐటీడీఏ పరిధిలో తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో సుమారు 329 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్‌బీ-పదాయిబీ కార్యక్రమం అమలుకు అధికారులు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 1,775 మంది ఉన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 1,079 మంది విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్యను నేర్చుకుంటున్నారు.

నూతన విద్యా విధానం అనుసరించి

నూతన విద్యా విధానం అనుసరించి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలను సమకూరుస్తూ శిక్షణ పొందిన కార్యకర్తలతో ఈసీసీఈ విధానంలో అందజేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల పౌష్టికాహార లోపాన్ని తగ్గించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నాం. అలాగే వైద్య సేవలు అందజేసేందుకు కృషి చేస్తున్నాం. పోషణ్‌భీ-పడాయిబీ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైంది. ఆరు రోజుల శిక్షణ అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా కార్యక్రమం అమలుకు కృషి చేస్తున్నాం.
– మాణిక్యాంబ, సూపర్‌వైజర్, ఇరగవరం

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ



పోషణ్‌భీ-పడాయిబీ కార్యక్రమం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య సంరక్షణ విద్య, ఈసీసీఈపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కల్పించడమే ముఖ్య లక్ష్యంగా కృషి చేస్తున్నాం.
– ప్రమోదినీ కుమారి, సీడీపీఓ, తణుకు

ముగిసిన జాతీయ సదస్సు


తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: భారత దేశ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలు శక్తివంతంగా ఎదిగాయని, ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయని విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీవీఎస్ రామకృష్ణ అన్నారు. తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో భారతదేశంలో వ్యవస్థాపకత, సామాజిక ఆర్థిక కోణాలు – చారిత్రక, రాజకీయ దృక్కోణాలు అనే అంశంపై తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో రెండవరోజైన బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సామాజిక ఆర్థిక వ్యవహారాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఈ రంగం దేశ జీడీపీకి 30 శాతం వరకు సహకారంగా ఉంటుందని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు విజయవంతం అయ్యిందని, 52 పరిశోధన పత్రాలు వచ్చాయని చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారి ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, సదస్సు డాక్టర్ అల్లూరి వెంకట నాగవర్మ, కో కన్వీనర్‌లు జి.అరుణ కుమారి, వి.నాగన్న, ఎం.శ్రీనివాస్, వివిధ కళాశాలల నుంచి వచ్చిన పత్ర సమర్పకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు


పట్టణంలో 324 కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది మహోత్సవాలు పురస్కరించుకొని తాడేపల్లిగూడెం పుర దేవత బలుసులమ్మ అమ్మవారికి మంగళవారం ఆలయం శిఖరానికి విశేష కుంభాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఘనాపాటి ఫణిశర్మచే కలశాలకు సంప్రోక్షణ ఆరాధనలు చేశారు. అమ్మవారికి పూజలు జరిగాయి. పంచామృత ద్రవ్యాలతో, సుగంధ ద్రవ్య పరిమళ భరిత పుణ్యనదీ జలాలతో 324 అష్టోత్తర కలశాలతో, సన్నాయి వాయిద్యాలతో అమ్మవారి ఆలయం వద్ద నుంచి పట్టణంలోను, పాతూరు పుట్టింటి బలుసులమ్మ పార్కు వరకు ఊరేగింపు జరిగింది. అనంతరం ఆలయానికి అమ్మవారిని తీసుకువచ్చి, ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రైతుల కోసమే 'పొలం పిలుస్తోంది'


ఆకుతీగపాడులో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



ముద్దాపురంలో రైతులతో మాట్లాడుతున్న దృశ్యం

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెంటపాడు: నాణ్యమైన దిగుబడులు పొందేందుకు ప్రతీ రైతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల వ్యవసాయశాఖ ఏవో పార్థసారథి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. వచ్చే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తేమశాతం, సంచులు తదితర విషయాలను రైతులకు వివరించారు. ప్రతి మిల్లు వద్ద రైతుల ధాన్యం కొనుగోలుకు సంబంధించి వీఆర్వోను ఏర్పాటు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న తేమ శాతం మిల్లర్ల వద్ద వచ్చేలా చర్యలు తీసుకొంటామన్నారు. కొనుగోళ్లకు సంబంధించి రైతులు తేమ శాతం పరిశీలించి విరివిగా ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. మిల్లర్ల వద్ద ఏదేనా లోపాలు ఉంటే తక్షణం తనకు మెసేజ్ చేయాలన్నారు. ఈ విషయం ప్రతిష్టాత్మకంగా తీసుకొంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు విషయంలో లోపాలు లేకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు. పచ్చిరొట్ట, జీలుగ, అలసంద విత్తనాలను వేసుకొని అంతర పంట వేసుకోవాలన్నారు. పలువురు రైతులకు విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ముదునూరులో రైతుల మాసూళ్లను జెడీ పరిశీలించారు. ఆకుతీగపాడులో రోడ్డు పక్కన ఉన్న గృహాల విషయంలో ఉన్న సమస్యలు తీర్చాని జేసీని వేడుకొన్నారు. ఆర్డీవో కౌసల్, వ్యవసాయశాఖ జెడీ జెడ్ వెంకటేశ్వర్లు, ఏడీఏ పి. మురళీకృష్ణ, తహసిల్దార్ సీతామహాలక్ష్మి, ఎంపీడీవో బాలాజీ, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల తదితరులు పాల్గొన్నారు.


నందమూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

నందమూరులో పొలం పిలుస్తోంది

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నందమూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. రైతులు వారికి కావలసిన రైతు మిల్లుకు ధాన్యాన్ని పంపించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ధాన్యం విక్రయించిన రెండ్రోజుల్లోనే రైతుల ఖాతాకు సొమ్ము జమ అవుతుందన్నారు. అలాగే, ప్రభుత్వం కొత్తగా వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించేలా సౌలభ్యం కల్పించిందన్నారు. రైతులు వాట్సాప్‌లో ఎప్పుడు ధాన్యం కోస్తున్నాం, ఎన్ని బస్తాలు విక్రయిస్తున్నాం వంటి వివరాలను ఆధార్ కార్డు నెంబరుతో రిజిస్టర్ కావాలన్నారు. తద్వారా రైతులు ధాన్యాన్ని ఇంటి వద్ద నుంచే విక్రయించవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామ నాయకులు దార్లంక రాము, శనగన రాంబాబు, శనగన శ్రీను, అడపా శ్రీనివాస్, వీఏఏ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అధికారులు సహకరించాలి

తణుకు అర్బన్: ధాన్యం కొనుగోళ్లలో రైతాంగానికి వ్యవసాయ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని సివిల్ సప్లైస్ డీఎం శివప్రసాద్ అన్నారు. తణుకు మండలంం ముద్దాపురం గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు చేసే సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, గోనె సంచుల రవాణా కూడా సక్రమంగా ఉండేలా చూడాలని వ్యవసాయాధికారులకు సూచించారు. ట్రక్ షీట్ అయిన వెంటనే ఈకేవైసీ చేయించుకుని వెళ్లాలని రైతాంగాన్ని కోరారు. ముందుగా వాట్సాప్ షెడ్యూల్ చేసుకోవాలని రైతాంగం సహకరించాలని సూచించారు. ఈ వేసవిలో అపరాలు సబ్సిడీపై ఇస్తామని, పచ్చిరొట్ట పైరులు అపరాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. అనంతరం వ్యవసాయశాఖలోని వివిధ స్కీముల గురించి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం వీ రమేష్ వివరించారు. మండల వ్యవసాయాధికారి కుసుమ మాట్లాడుతూ వేసవిలో అపరాలు సబ్సిడీ పై ఇస్తామని, పచ్చి రొట్ట పైరులు అపరాలు కావాల్సినవారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ శ్రీను, వీరాస్వామి, రైతులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రక్షణ కోసం పోరాటాలు చేయాలి


మాట్లాడుతున్న మామిడి దానవరప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక చట్టాల రక్షణ కోసం సమరశీల పోరాటాలు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడిదాన వర ప్రసాద్ కోరారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. తల్లికి వందనం, డీఎస్సీ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు, పింఛన్ పథకం, రైతు భరోసా, ఇళ్ల లేని నిరుపేదలకు పక్కా గ్రహాలు, బీసీలకు ఇస్తానన్న 50 సంవత్సరాలకే పెన్షన్ తదితర హామీలను అమలు చేయడం లేదన్నారు. బీసీ అట్రాసిటీ యాక్ట్ అమలు చేయాలని, నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సంఘం గౌరవాధ్యక్షుడిగా మామిడి దాన వరప్రసాద్, ఎం.వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా బండి దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మేక ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా జమితార చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా ధవలేశ్వర పాండు రంగారావు, కోశాధికారి దేవబత్తుల రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా ఆర్.చంటి, బి.నాగేశ్వరరావు, సీహెచ్ చిన్న రాము అప్పన్న, వెంకట రమణలను ఎంపిక చేశారు.

రసాభాసగా దువ్వ సహకార సంఘ సమావేశం


దువ్వ సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో సొసైటీలో పనిచేసిన వ్యక్తి రూ. 25 లక్షలు స్వాహా చేసి పరారైన ఉదంతంపై రైతాంగం అధికారులను నిలదీశారు. సొసైటీలో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధుల్లో ఉండే కొప్పిశెట్టి రామ హనుమాన్‌కుమార్ అలియాస్ రాము రైతులు చెల్లించిన బకాయిలను కాజేసి ఇటీవల పరారయ్యారని అతనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాల్సిందిగా రైతులు డిమాండ్ చేశారు. రాము దువ్వ గ్రామానికి చెందిన వారు కావడంతో గతం నుంచి రుణ బకాయిలకు సంబంధించిన మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేస్తే రశీదులు ఇచ్చేవారని అదే విధంగా ఇటీవల కాలంలో రైతులు ఫోన్ పే ద్వారా వేసిన మొత్తాన్ని దుర్వినియోగం చేశారని రైతులు వాపోయారు. ఈ వ్యవహారంపై ఈనెల 12వ తేదీన తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా రైతులు తెలిపారు. దీంతో ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కిరణ్, ఎంపీపీ రుద్రా ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, నాయకులు కట్టా రామారావు, శిరిగిశెట్టి వెంకటేశ్వరరావు, చిక్కాల వేణు, అరిగెల బాబి, చిక్కాల మోహన్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేత


విద్యార్థులకు స్టీలు వాటర్ బాటిల్స్ అందజేసిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను, కృష్ణాయపాలెం పాఠశాల విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థవారు స్టీల్ వాటర్ బాటిల్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వాటర్ వాడకం వల్ల కలిగే అనర్థాలను మానవత కమిటి సభ్యురాలు పైడికొండల సింధు వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలన్నారు. క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. మానవత సభ్యులు యర్రా ఆంజనేయస్వామి, యెగ్గిన శరత్, పాందురంగారావు, కురుమెళ్ల వెంకటాచలం, బురిడి సతీష్, మిరియాల కిషోర్‌కుమార్, చేకూరి బంగార్రాజు, కురుమెళ్ల బాలకృష్ణ, జనపనేని రాజేంద్రకుమార్, శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను ముందస్తుగా గుర్తించాలి



మాధవరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వీరవెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను ముందస్తుగా గుర్తించాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీరవెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరవెంకటేష్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు మహిళల్లో అత్యధికంగా కనిపిస్తున్నాయన్నారు. గ్రామ స్థాయిలో క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా తీవ్రతను నియంత్రించవచ్చన్నారు. ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి అవసరమైన పరీక్షలు చేసి, క్యాన్సర్ బాధితులను గుర్తించాలన్నారు. అలాగే గ్రామాల్లో హై రిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి అవసరమైన పోషకాలతో కూడిన మందులను అందించాలన్నారు. అవసరమైతే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పథకం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సింధు, హెచ్‌వీ శిరోమణి, ఎంపీహెచ్‌ఈవో జి.వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ

తాడేపల్లిగూడెం: ఇంటి పన్ను, ఖాళీ స్థలాల్లో చెల్లించాల్సిన పన్ను సకాలంలో చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో చెల్లించాలని, అయితే ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం యాభై శాతం వడ్డీ రాయితీతో పన్ను చెల్లించే అవకాశాన్ని కల్పించారని మునిసిపల్ కమిషనర్ ఎం.యేసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొదటి అర్ధ సంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ నెల 31వ తేదీలోపు ఒకేసారి పన్ను చెల్లించిన వారికి రాయితీ కల్పిస్తూ జీఓ జారీ చేశారని కమిషనర్ వివరించారు. ఇప్పటికే పన్ను బకాయి వడ్డీతో చెల్లించిన వారికి యాభై శాతం రాయితీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో జమ చేస్తామని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మునిసిపల్ పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం


జబర్దస్త్ అప్పారావును సత్కరిస్తున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 154వ నెలవారీ సత్కారాలు, సభ కార్యక్రమం పట్టణంలోని గీతా మందిరంలో జరిగాయి. జబర్దస్త్ అప్పారావు హాజరై స్కిట్లు ప్రదర్శించి, ఘంటసాల పాటలను పాడారు. హాస్యవల్లరి, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాసా బాబురావులు పర్యవేక్షించారు. నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి-రాంబాబులకు గౌరవ సత్కారం, సినీ, టీవీ, నాటక రంగ హాస్య నటుడు జబర్దస్త్ అప్పారావుకు కళా పురస్కారం, ఆర్టీసీ ఉద్యోగి దొంతల విజయకుమార్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, రంగస్థల నటి జి.నాగమణికి ఆర్థిక సత్కారం చేశారు. అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడాయర్, కళాకారులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ హౌసింగ్‌బోర్డు, కొండయ్యచెరువు, పాతూరు విద్యుత్ సబ్ స్టేషన్లు పరిధిలో అన్ని ఫీడర్‌లలో వన్‌టౌన్ అన్ని ఏరియాల్లో ఈ నెల 26వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లో ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. విభజన పనులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నన్నయ్య రిజిస్ట్రార్ గూడెం క్యాంపస్ సందర్శన

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ అధికారికంగా నన్నయ్య విశ్వ విద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌ను సందర్శించారు. విద్యా, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆధ్యాపకులతో మాట్లాడారు. తరగతి గదులను తనిఖీ చేశారు. మహిళా హాస్టల్‌ను సందర్శించారు. మెస్ సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్‌లో సౌకర్యాలను విద్యార్థినీల నుంచి ఆరా తీశారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. అశోక్ మాట్లాడుతూ క్యాంపస్‌లో మరిన్ని సౌకర్యలను మెరుగుపర్చాలని రిజిస్ట్రార్‌ను కోరారు. తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బాలాత్రిపుర సుందరీ సమేత మల్లేశ్వరస్వామి వారి పాంచాహ్నిక ధ్వజారోహణ కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 29వ తేది వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి ప్రతినిధి ముళ్లపూడి రామకృష్ణ తెలిపారు. సాయంత్రం స్వామివారి కల్యాణం, అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కోటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడుకు చెందిన గంధం సతీష్, లతా పద్మశ్రీ దంపతులు మంగళవారం కోటమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వెండి కుడిచేయి, వెండి ఖడ్గాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ ఉత్సవకమిటీ సభ్యులు సతీష్ దంపతులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల సత్యనారాయణ, గ్రామ పెద్దలు మల్లెల ప్రసాద్, పంతం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.